క్లుప్తంగా

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న నాగరాజు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి బీఏఎం డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నాగరాజు విరాళం అందజేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.1లక్ష రూపాయల చెక్కును నాగరాజు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి కళాశాల నిర్మాణానికి విరాళాలను ఇవ్వాలని కోరారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, డైరెక్టర్ కరుణాకర్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, కమ్మదనం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్



చెక్కులు పంపిణీ చేస్తున్న బాబర్‌ఖాన్

షాద్‌నగర్: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. సీఎం సహాయనిధి నుంచి పలువురి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకుగాను ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అగ్గనూరు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, కృష్ణారెడ్డి, రఘునాయక్, సర్వర్‌పాషా, యాదగిరియాదవ్, ముబారక్, మన్నె రవి, నీరటి వాసు, రాజు, జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

బీజేపీ సీనియర్ నాయకుడు సతీశ్‌రెడ్డి

షాబాద్: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా, తులం బంగారం, పూర్తిస్థాయి రుణమాఫీ అందించలేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం భయాందోళన గురిచేసే విధంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రధాని మోదీ సహకారంతోనే ఇప్పటికీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాము, కూతురు మహేందర్, మాణెయ్య, గోపాల్, రాజీవ్‌రెడ్డి, మహేశ్, నారాయణ, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

జీఎం విత్తనాల ప్రవేశాన్ని ఆపాలి

షాబాద్: జీఎం విత్తనాలను మన దేశంలో ప్రవేశపెట్టకుండా పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన భారతీయ కిసాన్ సంఘ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాల జెనెటికల్ మోడిఫికేషన్‌తో అనేక దుష్పరిణామాలు వస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో బీటీ వన్, బీటీ టూ, బీటీ త్రీ, బీటీ ఫోర్, బీటీ ఫైవ్ పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బీటీ పత్తి విత్తనాల సాగులో గ్లైఫోసెట్ కలుపు మందు వాడుతున్నారని, నతఈ మందు కేన్సర్‌కు దారిస్తున్నట్లు అనేక పరిశోధనలు వెల్లడించాయని చెప్పారు. వంకాయ, ఆవాలు లాంటి విత్తనాలలో జీఎం ప్రవేశపెట్టి అధిక దిగుబడిని సాధించవచ్చని విదేశీ కంపెనీలు నమ్మపలుకుతున్నాయన్నారు. జెనెటికల్ మార్పింగ్ జరిగిన విత్తనాలతో పండిన పంటలను మాంసాహారమా, శాఖాహారమా ఇప్పటికీ తేల్చలేదన్నారు. విత్తనాల ప్రవేశాన్ని ఆపేందుకు ఇప్పటికే అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల సభ్యులకు వినతి పత్రాలు అందించామని తెలిపారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, చంద్రయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్భాటాలు ఘనం.. ఆచరణ శూన్యం



కొడిచర్ల గ్రామంలో వినియోగంలో లేని డంప్‌యార్డు



కొత్తూరులో నీటమునిగిన తడి, పొడి చెత్తను వేరుచేసే షెడ్

- సేంద్రియ ఎరువుల తయారీపై నిర్లక్ష్యం
- చెత్త డంపింగ్‌కే పరిమితమైన కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను తీర్చడానికి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీల్లో డంపింగ్‌యార్డుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గ్రామజ్యోతి పథకంలో కూడా డంపింగ్‌యార్డులకు మొదటి ప్రాధాన్యం కల్పించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా అప్పట్లో గ్రామాల్లో డంపింగ్‌యార్డుల నిర్మాణానికి రూ.1.72లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాగా డంపింగ్‌యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. కొన్ని గ్రామాల్లో చెత్తను డంపింగ్ చేసే షెడ్లను లోతట్టు, చెరువుల సమీపంలో నిర్మించారు. దీంతో వర్షాకాలంలో వాటిలోకి నీరుచేరి వినియోగానికి దూరంగా ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల అధికారులు వ్యర్థాలతో ఎరువుల తయారీని అంతగా ప్రోత్సహించడం లేదు. కేవలం ప్లాస్టిక్, ఇతర వస్తువులను వేరుచేసి విక్రయిస్తున్నారు. కొత్తూరు మండల పరిధిలో 12 పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాలు ఉన్నాయి.

గతంలో ఉపాధిహామీ నిధులతో నిర్మాణం..

- ఉపాధిహామీ పథకంలో భాగంగా డంప్‌యార్డు నిర్మించడానికి సంబంధిత గ్రామ సర్పంచ్, కార్యదర్శి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలి.
- ఆ స్థలంలో డంప్‌యార్డు నిర్మాణానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేవని పంచాయతీ నుంచి చేసిన తీర్మానం కాపీలను సంబంధిత శాఖ అధికారులకు అందజేయాలి.
- ఉపాధిహామీ పథకంలో భాగంగా ఒక్క డంప్‌యార్డు నిర్మించడానికి ప్రభుత్వం రూ.1.72లక్షలు ఇస్తుంది.
- ఈ పనులను వందశాతం ఉపాధి కూలీలతోనే చేపట్టాలి.
- బయట 25 మీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పు, లోపల 15 మీటర్ల పొడవు, 9 మీటర్ల వెడల్పు ఉండే విధంగా నిర్మాణాలు చేయాలి.

రోడ్లపక్కనే చెత్త చెదారం..

కొత్తూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు సుమారు 08 అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలు ఉన్నాయి. మండలంలో 22వేల మంది జనాభా ఉన్నారు. డంప్‌యార్డుల్లోకి నీరు చేరడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంప్‌యార్డులకు తరలించే పరిస్థితి లేదు. దీంతో శివారులోని రోడ్లు, ఖాళీ స్థలాల్లో సిబ్బంది చెత్తను పారబోస్తున్నారు. ప్రత్యామ్నాయం లేక పంచాయతీ సిబ్బంది చెత్త కుప్పలుగా పేరుకోకుండా తరచూ తగలబెడుతున్నారు.

డంప్‌యార్డులను ఆధునీకరిస్తాం



మండలంలో చాలావరకు పాత పద్ధతుల్లో నిర్మించిన డంప్‌యార్డులే ఉన్నాయి. త్వరలో డంప్‌యార్డులను ఆధునీకరించే పనులు చేపడతాం. కొన్నిచోట్ల డంప్‌యార్డుల్లోకి నీరు చేరడంతో వినియోగంలో లేవు. సిబ్బందికి తడి, పొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తాం.

– అరుంధతి, ఎంపీడీఓ, కొత్తూరు

వర్గీకరణను ఎవరూ ఆపలేరు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహా



విలేకరులతో మాట్లాడుతున్న నర్సింహా

కొందుర్గు: ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ పోరాట వారసులు మాదిగలన్నారు. ఆయన ఆశయాన్ని వ్యతిరేకించే కొంతమంది మనువాదులు వర్గీకరణను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. 1975లోనే వర్గీకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం ఉత్తిదేనని, వారి తాత, ముత్తాతలు వచ్చినా వర్గీకరణను ఆపలేరన్నారు. అంబేడ్కర్ ఫలాలను అందరికి అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగించే వారసులు మాదిగలేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు ఆనంద్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

షాద్‌నగర్‌రూరల్ సీఐ నర్సయ్య



మాట్లాడుతున్న సీఐ నర్సయ్య

కొందుర్గు: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని షాద్‌నగర్‌రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. కొందుర్గు పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ నర్సయ్య హాజరై మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని, దేవాలయాలు, ప్రార్థన మందిరాల్లోను చోరీలు జరుగుతున్నాయన్నారు. దొంగతనాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆర్థిక స్తోమత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేందుకు దాతలు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనువాసు, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, నాయకులు లక్ష్మయ్యగౌడ్, గోపాల్, నర్సింలు, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి

మొయినాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగం మరువలేనిదని బీఆర్‌ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని సోమవారం మండలంలోని తెలంగాణ అమరవీరులు యాదిరెడ్డి, మహేశ్, సరిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగం వృథా కాలేదన్నారు. వారి త్యాగ ఫలితంగానే రాష్ట్రం సాధించుకుని స్వరాష్ట్రంలో జీవిస్తున్నామన్నారు. అమరవీరుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, నాయకులు సత్తిరెడ్డి, అంజయ్యగౌడ్, శ్రీకాంత్, పరమేశ్, ప్రవీణ్, రాజు, రవి, ఆజాద్, షరీఫ్, అలీమ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

మండల పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: రైతులు మూగ జీవాలకు పారుడు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం, షాబాద్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి మూగజీవాలకు పారుడు వ్యాధి టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ వద్ద గల మూగజీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి జీవాలకు టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

గిన్నిస్ బుక్ మార్చ్ లార్జ్ ట్రైనర్ ప్రతిభ



క్రీడలను ప్రారంభిస్తున్న గిన్నిస్ బుక్ మార్చ్ లార్జ్ ట్రైనర్ ప్రతిభ

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు పట్టుదల, కృషి ఉంటే అనుకున్న దానికి సాధించేందుకు వెనుకాడరని గిన్నిస్ బుక్ మార్చ్ లార్జ్ ట్రైనర్ ప్రతిభ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలలో క్లాస్ గ్రౌండ్ వార్షిక స్పోర్ట్స్ ఎక్స్‌ట్రాంజాను నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 6వ తేదీవరకు కళాశాల గ్రౌండ్ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాపోటీలను ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆ ర్కిటెక్చర్ విద్యార్థి సంఘంలో అథ్లెటిక్ సిజం స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో వివిధ ఆర్కిటెక్చర్ కళాశాలల నుంచి సుమారు 750 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండోనేషనల్ బాక్సింగ్ వరల్డ్ ఛాంపియన్ బంగారు పతక విజేత ప్రతిభ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులతో కలిసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలలో క్రీడోత్సవాలను నిర్వహించడం ఇందులో అంతర్జాతీయంగా విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడానికి దోహదపడుతుందన్నారు. పోటీల్లో విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, కళాశాల కార్యదర్శి వంశీధర్, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్



పవర్ బ్లింకర్స్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఐ సడక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు మేనేజర్ మహ్మద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలోని రామేశ్వరం కమాన్‌వద్ద జాతీయ రహదారిపై రూ.1.75లక్షలతో పవర్ బ్లింకర్స్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఈ పవర్ బ్లింకర్స్‌ను ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు. జాతీయ రహదారిపై వాహనాలు అతివేగంతో నడపడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా ముఖ్య కూడళ్ల వద్ద వేగ నియంత్రణకు పవర్ బ్లింకర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనదారులు ముఖ్య కూడలిలో పవర్ బ్లింకర్స్‌ను గమనించి తమ వాహనాల వేగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సేఫ్టీ మేనేజర్ భానుప్రకాశ్, విశ్వనాథ్‌రాజు, బిజోయ్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలను వదిలి పనిచేయండి

- మాజీ మంత్రి సబితారెడ్డి
- రోడ్డు ప్రమాదంలోని మృతులకు నివాళి



మృతుల కుమారులను ఓదార్చుతున్న మాజీ మంత్రి

శంకర్‌పల్లి: అధికార పక్షం నాయకులు రాజకీయాలు పక్కన పెట్టి హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ స్టేజి సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతుల మృతదేహాలకు సోమవారం ఆమె నివాళులర్పించారు. అనంతరం వారి కుమారులకు ధైర్యం చెప్పారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు చేయకపోవడంతో నిత్యం ఎంతో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ చేసి, జాతీయ రహదారిగా చేయాలని ప్రణాళికలు రూపొందించాం. దానికి అనుగుణంగానే టెండర్లు సైతం పిలిచాం. ప్రక్రియ అంతా పూర్తయి దాదాపు ఏడాదిన్నర అయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై వందలాది మంది మృతి చెందుతున్నారని, ఇప్పటికైనా అధికార పక్షం నాయకులు రోడ్డు పనులను చేపట్టాలని విపక్షంగా తాము అడుగుతున్నామని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. మంత్రి వెంట శంకర్‌పల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగం, మహేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పెద్దఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ రత్నం ధ్వజమెత్తారు. సోమవారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇప్పటికీ ఇచ్చిన హామీలను నెరవెర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను విమర్శిస్తూనే లక్షల కోట్లు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని, బీజేపీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు డా.వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, కృష్ణమోహన్, జయసింహారెడ్డి, అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

బీఆర్‌ఎస్ నేత కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సోమవారం చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ చేవెళ్ల సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్–బీజాపూర్ రోడ్డు విస్తరణ పనుల కోసం టెండర్లు సైతం పూర్తయినా, పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు అంజనేయులు, షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానమార్గంతోనే ముక్తి లభిస్తుంది

త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షురాలు సద్గుణ



గ్రంథాలపై ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: జ్ఞానమార్గాన్ని అనుసరణీయం చేసుకుంటే ముక్తి లభిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి షాద్‌నగర్ కమిటీ అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. మార్గశిర మాసం(ధనుర్మాసం) ప్రారంభాన్ని పురస్కరించుకొని సోమవారం త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలపై పట్టణంలోని విజయనగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గుణ మాట్లాడుతూ.. దైవభక్తితో, గ్రంథపఠనంతో జ్ఞానాన్ని సముపార్జించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు కుందీప్‌రెడ్డి, ఆనంద్, స్వాతి, సంధ్య,రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి స్థల పరిశీలన

నందిగామ: నూతనంగా ఏర్పాటైన నందిగామ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ భవనానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులు, నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అవసరం లేని చోట్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించలేదని మండిపడ్డారు. మండల కేంద్రమైన నందిగామలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. వీలైనంత తొందరలో తహసీల్దార్ కార్యాలయానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయిస్తానని, మండల అభివృద్ధి తనవంతు కృషజ చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు